



మంగళవారం ఉష్ణోగ్రత

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	38
భద్రాద్రి	24	38



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:28 (బుధవారం)
సహర్ : 4:36 (గురువారం)

భానుడు భగభగమంటున్నాడు. మిట్టమధ్యాహ్నం వేళ నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఉదయం పది తర్వాత బయటకు వెళ్తే ఎండకు దిమ్మ తిరిగి పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలవడంతో పాటు, సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాలను సైతం కోల్పోయే ప్రమాదం ఉంది. వేసవి వచ్చిందంటే ముందుగా అప్రమత్తమవ్వాల్సిన ఆరోగ్యశాఖ మాత్రం అవేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు గతానికి మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం సమ్మర్ అలర్ట్ ప్రకటించక పోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 40డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై మాత్రం అధికారులు ఆదేశాలు జారీచేయకపోవడం, దానిపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించక పోవడం శోచనీయం.





మంగళవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన ఖమ్మం జడ్పీ సెంటర్

వేసవి వేళ ఏదీ 'యాక్షన్'?

ప్లాన్ రూపొందించని వైద్య ఆరోగ్య శాఖ

- పీహెచ్‌సీలకే పరిమితమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- బస్టాండ్, రైల్వే స్టేషన్లలోనూ కనిపించని వైనం
- వడదెబ్బ జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కరువు
- ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు

ఖమ్మం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా మార్చి నెలాఖరుకల్లా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమ్మర్ అలర్ట్ ప్రకటించి పలురకాల చర్యలు చేపట్టేది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతోపాటు, ప్రతీ పీహెచ్‌సీల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆర్ఎల్, ఎన్ఎస్ ద్రావణాలను అందుబాటులో ఉంచేది. అంతేకాదు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను కూడా ఏర్పాటు చేసేవారు. గతంలో ప్రతీ పీహెచ్‌సీ పరిధిలోనూ మూడు నుంచి ఐదువేల ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడంతోపాటు, 7నుంచి 10వేల వరకు ఆర్ఎల్, ఎన్ఎస్ ద్రావణాలను అధిక మొత్తంలో ఉండేలా చర్యలు తీసుకునేవారు. అయితే ఈ యేడాది దాని గురించి పట్టించుకునేవారే కరువయ్యారు.

పీహెచ్‌సీల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలకు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో అందుబాటులో ఉంచాల్సిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రస్తుతం పీహెచ్‌సీల్లోని గదులకే పరిమితమయ్యాయి. అవి కూడా కొన్ని పీహెచ్‌సీల్లో మాత్రమే సరిపడా ఉండటం గమనార్హం. చాలా పీహెచ్‌సీల్లో 500కు మించి ఓఆర్ఎస్‌లు లేవని సమాచారం. ఆర్ఎల్, ఎన్ఎస్‌ల పరిస్థితి కూడా అదేతీరున ఉండటం గమనార్హం. అయితే వేసవి కాలంలో ప్రతీయేటా చేసేపని కదా అంటూ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా కొందరు పీహెచ్‌సీల వైద్యులు మాత్రం తాము అప్రమత్తంగానే ఉన్నామంటూ సమాధానమిస్తున్నారు.

40డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉండగా.. మార్చి నెలాఖరు నాటికే ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటిపోయాయి. ఇటీవల నమోదైన ఉష్ణోగ్రతల్లో సోమవారం అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40.8ఉష్ణోగ్రత నమోదవగా రాష్ట్రంలో ద్వితీయస్థానంలో ఉంది. ఖమ్మం జిల్లాలో 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా భద్రాచలంలో 40.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జూలురుపాడులో 39.8, పాల్వంచ మండలం సీతారామపట్నంలో 39.7,అశ్వాపురంలో 39.5, చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో 39.3, లక్ష్మీదేవిపల్లిలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా కారేపల్లిలో 39.7, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 39.6, తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో, వైరాలో 39.4, మధిరలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు మినహా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిగిలిన మండలాల్లో 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే గతేడాదితో పోలిస్తే ఈ యేడాది రెండు డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు తెలుస్తోంది.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి..

- డాక్టర్ మాలతి, ఖమ్మం డీఎంహెచ్‌వో

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులోనే ఉన్నాయి. ఆర్ఎల్, ఎన్ఎస్ ద్రావణాలు ప్రతీనెల ఇండెంట్ ఆధారంగా పంపిస్తున్నాం. ఎక్కడా వాటికి కొరతలేదు. ప్రజలు ఎండలు పెరుగుతున్న దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించాలి. అనారోగ్యం పాలైతే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలి.



సీఎంతో యుగంధర్ భేటీ..

కాంగ్రెస్ నాయకుడు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లిన యుగంధర్ కొద్దిసేపు ముచ్చటించారు.

-ఖమ్మం సంక్షేమ విభాగం



నగరంలో బీజేపీ శ్రేణుల ర్యాలీ (ఇన్‌సెట్‌లో వినోద్‌రావు)

'తాండ్ర'కు ఘన స్వాగతం

ఖమ్మం బైపాస్‌రోడ్, మార్చి 26: బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు బీజేపీ శ్రేణులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు కాల్వవడ్డు వద్ద ఆహ్వానం పలికి అక్కడి నుంచి కార్లు, బైక్‌ర్యాలీతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా మయూరి సెంటర్, జడ్పీ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి వినోదరావు పూలమాలవేశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే విజయమని, మోదీ సర్కారులో 400 సీట్లలో ఖమ్మం సీటు కూడా ఉండేటట్లు చూస్తామని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, నున్న రవి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భగీరథ కష్టాలు

- పాలేరు జలాశయం నీటి కోసం అధికారుల పాట్లు
- కాల్వల్లో పూడిక తీసి మరీ నీటి తరలింపు
- ఇప్పటికే ఏడు అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- ఏప్రిల్ 1 తర్వాతే సాగర్ జలాలు విడుదలయ్యే అవకాశం



పాలేరు జలాశయంలో ఇన్‌టేక్ వెల్‌కు పూడికతీస్తున్న దృశ్యం

కూసుమంచి, మార్చి 26: పాలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పడిపోయింది. 23 అడుగుల గరిష్ఠానికిగాను ప్రస్తుతం 7అడుగులకు పడిపోయి వెలవెలబోతోంది. ఇక్కడి నుంచి ఉమ్మడి ఖమ్మంజిల్లాకే కాకుండా సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుత నీటిమట్టం తగ్గడంతో ఇన్‌టేక్ వెల్స్‌కు నీరందని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో పట్టణాలు, గ్రామాలు, శివారు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో నీటిఎద్దడి తలెత్తకుండా అధికార యంత్రాంగం దృష్టిసారించింది. పాలేరు జలాశయం ఆధారంగా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ఇన్‌టేక్ వెల్ వద్ద ఉన్నపైపులకు నీరందడంలేదని భావించిన అధికారులు జేసీబీలతో కాల్వలో పేరుకపోయిన పూడికను తొలగించే పనులను చేపట్టారు. 100 అడుగులమేర పూడిక తీయడంతో ఇన్‌టేక్ వెల్ పైపులకు తాగునీరు అందడం ద్వారా ఉమ్మడి ఖమ్మంజిల్లా వాసులకు నీటిసమస్య కొంతకాలం తీరుతుంది. అదేవిధంగా కూసుమంచి మండలానికి డీఫ్లోరైడ్ స్కీంకు సంబంధించి ఇన్‌టెక్‌వెల్ పైపులకు నీరందక పోవడంతో మోటార్లను అధికారులు మరింత కిందకు దింపారు. దీంతో ఈ మండలానికి కూడా తాగునీటి సమస్య తీరనుంది.

ఏప్రిల్ ఫస్ట్ తరవాతే సాగర్ జలాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఈ మూడు నెలలకు గాను తాగునీటి అవసరాల నిమిత్తం సుమారు 3 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనావేశారు. ఈక్రమంలో ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సాగర్ జలాలు అవసరం ఉంటుందని లేని పక్షంలో ఇబ్బందులు తలెత్తుతాయని నివేదికలో పేర్కొన్నారు. అయితే సాగర్ ఆయకట్టులో పంటలు చివరిదశకు వచ్చాయి. ఇప్పుడు తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదలచేసినా రైతులు వాడుకునే అవకాశం ఉంటుందని భావించి, ఏప్రిల్ ఫస్ట్ తరువాత ఇవ్వొచ్చని భావిస్తున్నారు. అప్పటివరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా సాగర్ డ్యామ్‌లోనూ నీరు కనిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 (312.5 టీఎంసీలు)గారు మంగళవారం నాటికి 513.7 అడుగులు. మరో మూడు అడుగులు 510 అడుగులకు తగ్గితే మరింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..

వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

6



కాంగ్రెస్‌లో 'ఖమ్మం' టెన్షన్

- లోక్‌సభ స్థానం టికెట్ కోసం పలువురు ప్రముఖుల పోటాపోటీ
- ఎటూ తేల్చలేకపోతున్న అధిష్ఠానం
- తమవారి కోసం ముగ్గురు మంత్రుల పట్టు
- ఇతర నేతల నుంచీ తీవ్ర పోటీ
- మరింత ఆలస్యమవుతున్న అభ్యర్థి ప్రకటన
- ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్, బీజేపీ

ఖమ్మం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక సజావుగా సాగుతున్నా ఖమ్మం సీటు విషయంలో ఆశావహుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. దీంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందోనన్న విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇప్పటికే ఖమ్మం స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు, బీజేపీ నుంచి తాండ్ర వినోద్‌రావు పేరును ఆయా పార్టీలు ప్రకటించాయి. దీంతో వారు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

కానీ కాంగ్రెస్‌లో మాత్రం టికెట్ రేస్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ టికెట్ కోసం పాత, కొత్త నేతల మధ్య పోరు నడుస్తుండగా మరికొంతమంది కొత్తవారి పేర్లు కూడా తాజాగా తెరపైకి వస్తున్నాయి. దీంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందోనన్నది చివరి వరకు సస్పెన్స్‌గానే ఉంది. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ మరోసారి బుధవారం ఢిల్లీలో సమావేశమవుతోంది. ఈ సమావేశంలోనూ ఖమ్మం టికెట్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. చివరి వరకు ఈ టికెట్ విషయంలో ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి స్థాయిలో వారు హైదరాబాద్, ఢిల్లీలో టికెట్ కోసం మంతనాలు సాగిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక సమీకరణాలు, ఆయా వర్గాల సీట్ల కేటాయింపును బట్టి ఖమ్మం టికెట్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ జరిగే అవకాశం ఉంది.

ముగ్గురు మంత్రుల పట్టు

ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల బంధువులు ఖమ్మం సీటు రేసులో ఉండడం, మరోవైపు ఇతర ప్రముఖులు కూడా ఈ టికెట్ ఆశిస్తూ ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు ఖమ్మం నియోజకవర్గం కంచుకోటగా ఉంది. 2014లో పొత్తులో భాగంగా ఖమ్మం సీటును సీపీఐకి కేటాయించగా ఆ ఎన్నికల్లో సీపీఐ ఓడిపోయింది. 2019లో కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లో చేరడంతో గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ ఓటమి చెందింది. బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయం సాధించారు.

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుండగా కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గెలిచారు. ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు తిరుగులేని మెజారిటీ వచ్చింది. ఏడు సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో పాటు 2,66,162 ఓట్ల మెజారిటీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పరమైనంది. కాంగ్రెస్, సీపీఐ కూటమి అభ్యర్థులకు 7,33,293 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అభ్యర్థులకు 4,47,631 ఓట్లు లభించాయి. భారీ ఆధిక్యత కాంగ్రెస్ సొంతం చేసుకోవడంతో అందరి దృష్టి ఖమ్మం కాంగ్రెస్ సీటుపైనే ఉంది. ఈ సీటు కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని రంగంలో ఉండగా, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మరో నాయకుడు నాగసీతారాములు ఖమ్మం ఎంపీ టికెట్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పలువురి పేర్లు..

మంత్రుల కుటుంబం నుంచి ఎవరికీ టికెట్ ఇవ్వని పక్షంలో పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికి ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలన్న వాదనను కొందరు తెరపైకి తెస్తున్నారు. ఖమ్మానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేరు కూడా రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఏఐసీసీ దృష్టికి తీసకెళ్లినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు మైనారిటీ వర్గానికి చెందిన జావీద్‌కు టికెట్ ఇవ్వాలని ఆయన అనుచరులు కూడా అధిష్ఠానానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందన్నది సస్పెన్స్‌గా మారింది.



మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

జై ఆంజనేయం

- టేకులపల్లి ఆంజనేయస్వామి భూముల పరిరక్షణ
- మంత్రి తుమ్మల ఆదేశంతో కలెక్టర్ గౌతమ్ చర్యలు
- సర్వే చేసి అనంతరం రికార్డుల్లో నమోదు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం

6

పిచ్చికుక్క స్వైరవిహారం

బూర్గంపాడులో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు







బూర్గంపాడు, మార్చి 26: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో సంచరిస్తూ కనిపించిన వారిపైపడి తీవ్రంగా గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం బూర్గంపాడు, భద్రాచలంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దాడిలో గాయపడిన వారిలో సీతారాములు, మహేష్‌బాబు, కౌషర్‌పాషా, భవ్యశ్రీ, కుందన, తదితరులు ఉన్నారు. మరికొంత మందికి స్వల్ప గాయాలు కావడంతో వారు వ్యాక్సిన్ వేయించుకుని ఇళ్లకు వెళ్లినట్లు తెలుస్తోంది. గ్రామంలో స్వైర విహారం చేస్తున్న ఆ పిచ్చికుక్కను గ్రామస్థులు వెంబడించి చంపేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పిచ్చికుక్క ఓ గేదెపై కూడా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో కుక్కలు, కోతులు బెడద ఎక్కువైందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



ఆస్తి పన్నుల రాబడి రూ.24 కోట్లు

- ఇంకా వసూలు కావాల్సింది రూ.6 కోట్లు
- 31వరకు వడ్డీ రాయితీ పొందే సౌలభ్యం
- పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి: కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

6

చట్టబద్ధ దత్తతే క్షేమం..



» అక్రమ దత్తత నేరం, భవిష్యత్తులో అవస్థలు » దత్తత వెళ్లిన పిల్లలపై శిశు సంక్షేమశాఖ పర్యవేక్షణ » జిల్లాలో పెరుగుతున్న అక్రమ దత్తత కేసులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26: ఖమ్మం జిల్లాలో అక్రమ దత్తత కేసులు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను రోడ్ల వెంట వేయటం, ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో జన్మించిన చిన్నారులను సిబ్బందికి, అధికారులకు తెలియకుండా వేరే వారికి అక్రమ దత్తతగా అందించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయనే వాదనలు వినపడుతున్నాయి. అధికారులు బాల్య వివాహలు, అక్రమ దత్తతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కానరావడం లేదు. జిల్లాలో బాల్య వివాహలు, అక్రమ దత్తత, తదితర కేసులు ఇప్పటి వరకు సుమారు 17 వందల వరకు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇవి కేవలం సీడబ్ల్యూసీ పరిధిలోకి వచ్చిన కేసులు మాత్రమే. రాని కేసులు ఇంకా ఎక్కువగానే ఉంటాయని సమాచారం.

2021 తర్వాత దత్తత కోసం 73 దరఖాస్తులు

జిల్లాలో పిల్లల దత్తత కోసం 2021 తర్వాత మొత్తం 73 దరఖాస్తులు వచ్చాయి. కాగా రెండేళ్ల నుంచి బాల్య వివాహలకు సంబంధించి 118 కేసులను అధికారులు నమోదు చేశారు. 2021 కంటే ముందు దరఖాస్తులు చేసుకున్న ఇతర జిల్లాల, రాష్ట్రాల తల్లిదండ్రులకు ఖమ్మం జిల్లా పరిధిలోని 23 మంది పిల్లలను దత్తతగా అందించారు. అలాగే ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన 21 మంది పిల్లలను ఖమ్మం జిల్లాకు చెందిన తల్లిదండ్రులకు అందించారు. 2021 నుంచి 2024 వరకు పిల్లల కోసం దరఖాస్తులు చేసుకున్న తల్లిదండ్రుల దరఖాస్తులు 73 మందికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్వరలోనే దత్తత ఇవ్వనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల దత్తత ఇచ్చే ప్రక్రియను అమలులో ఉన్న మాన్యువల్ పద్ధతికి స్వస్తి పలికి ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో చట్ట ప్రకారం పిల్లలను దత్తత తీసుకునేందుకు దంపతులు అడుగులు వేస్తున్నారు. పిల్లల దత్తతకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ, లేదా రాష్ట్ర ప్రభు త్వ పరిధిలోని ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో వివరాలను నమో దు చేయాల్సి ఉంటుంది. దత్తతపై ఎలాంటి సమాచారం కోసమైనా జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

పిల్లలను దత్తత తీసుకోనేందుకు నియమాలు

పిల్లలను దత్తత తీసుకునే దంపతులు లేదా దత్తత తీసుకునే వ్యక్తి కచ్చితంగా ప్రభుత్వ నియమాలు పాటించాలి. దత్తత తీసుకునేవారి పుట్టిన తేదీ, నివాస ధ్రువపత్రాలు, కరెంట్ బిల్లు, ఆదాయానికి సంబంధించిన ప్లే స్లిప్స్, దత్తత తీసుకునే వారికి దీర్ఘకాలిక వ్యాధులు లేవని రుజువు చేసే వైద్యపరీక్షల పత్రాలు, దంపతుల వివాహ ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా అందించాలి. ఒంటరి స్త్రీలు మగ, ఆడ పిల్లల్లో ఎవరినైనా దత్తత తీసుకోవచ్చు. మగవారు మాత్రం కేవలం మగపిల్లలనే దత్తత తీసుకోవాలి. ముగ్గురు అంతకంటే ఎక్కువ పిల్లలు ఉంటే వారికి దత్తత వర్తించదు.

మధ్యవర్తుల ద్వారా దత్తత వద్దు..

అక్రమ పద్ధతిలో పిల్లల దత్తత ముున్ముందు సమస్యలను తీసుకువస్తుంది. అక్రమ పద్ధతిలో దత్తత తీసుకుంటే పిల్లలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండదు. ఒక వేళ కుటుంబంలో పొరపొచ్చాలు వచ్చినా, దత్తత తీసుకున్న ఆ జంటకు తర్వాత పిల్లలు పుట్టడం, దత్త త వచ్చిన పిల్లలపై ప్రేమ తగ్గడం, లేదా దంపతులు విడిపోవాల్సిన సందర్భాలు ఏర్పడినప్పుడు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ప్రైవేటు వ్యక్తులు, మధ్యవర్తుల ద్వారా దత్తత తీసుకోవడం మరింత ప్రమాదం.

దత్తతకు వెళ్లిన పిల్లల క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలుసుకుంటారు. గ్రామీణ ప్రాంతాలలో నేటికీ బాల్య వివాహలు, అక్రమ దత్తత ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన బాల్యవివాహాలను వారు అడ్డుకుంటూ తల్లిదండ్రుల పైన చర్యలు తీసుకుంటూ అవగాహన కల్పిస్తూ ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు మనం తరచూ చూస్తూనే ఉన్నాం. గ్రామీణ ప్రాంతాలలో పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుంటున్న ఘటనలు సైతం ఎక్కువగా ఉంటున్నాయి. ఖమ్మం నగరంలోని ఓ మహిళ తనకు పుట్టిన రెండు రోజులకే ఆ పసికందును మరోకరికి అక్రమ మార్గాన అందించిన సంఘటనతోపాటు పుట్టిన వెంటనే ముళ్ల కంచెలో పడేసిన సంఘటన తదితర అంశాలు ఎన్నో ఉన్నాయి. వీటిపై అధికారులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఇలా ఎన్నో కేసులు అక్రమ పద్ధతిలో దత్తత తీసుకుంటున్నారు. తెలిసిన కేసులను అధికారులు పరిష్కరిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

● రాంగోపాల్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

పిల్లలు లేని దంపతులకు ప్రభుత్వ షరతులతో పిల్లలను అందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అక్రమ పద్ధతిలో పిల్లలను తీసుకుంటే చట్ట ప్రకారం చెల్లదు. అలా చెసిన వారిపై కేసులు నమోదు అవుతాయి. ఎక్కడైనా అక్రమ దత్తత జరిగినట్టు తెలిసిన వెంటనే అధికారులు వారిపై కేసులు నమోదు చేస్తారు. చట్ట ప్రకారం దత్తత తీసుకుంటే ఈ సమస్యలు రావు. పిల్లలు వద్దు అనుకునే వారు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయలలో వేసి వెళ్లవచ్చు. అలా కాకుండా అక్రమ దత్తతకు పాల్పడితే ఇచ్చిన వారిమీద, తీసుకున్న వారి మీది కేసులు నమోదు చేస్తాం. పిల్లలు కావాల్సిన దంపతులు ప్రభుత్వ వెబ్‌సైట్ కారాలో వివరాలు నమోదు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం పిల్లలను దత్తతగా అందిస్తాం.

బొగ్గు ఉత్పత్తిలో యంత్రాల వినియోగాన్ని పెంచాలి

» థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేస్తాం

» సమీక్ష సమావేశంలో సింగరేణి సీఎండీ బలరాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం

కొత్తగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన ఇంధనాన్ని అందించేందుకు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్లు సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం తెలిపారు. సింగరేణిలో యంత్రాల వినియోగ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం బొగ్గుఉత్పత్తి, యంత్రాలవినియోగంపై అధికారులతో సీఎండీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే యంత్రాల పని సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, యంత్రాల నిర్వహణ ఖర్చులను తగ్గించి, నూతన టెక్నాలజీని ఉపయోగించి బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. పని ప్రదేశాల్లో రక్షణసూత్రాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి అందరి లక్ష్యం కావాలని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి థర్మల్‌విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తున్నామన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సైతం మరింత పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు, అన్ని విభాగాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుల రాబడి రూ.24 కోట్లు

● పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి: కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 26: అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల కోడ్ నగరపాలకసంస్థ ఆస్తిపన్ను వసూళ్లపై ప్రభావం చూపించింది. అయినప్పటికీ సిబ్బంది ఎంతో కృషి చేసి. లక్ష్యానికి రూ.6కోట్ల దూరంలో నిలిచారు. ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి రూ.30.40 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.24.40కోట్లు వసూలు చేశారు. నగరంలో 77,420 నివాసాలనుండి ఆస్తిపన్నులు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 35,800 నివాసాల వద్దనుండి ఆస్తిపన్నులు వసూలు చేశారు. ఈ ఐదురోజుల్లో మిగతా నివాసాలనుండి ఆస్తిపన్నులు వసూలు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

భారీబకాయిదారులకు వడ్డీపై 90శాతం రాయతీని ప్రభుత్వం ప్రకటించినందున వారికి అవగాహన కల్పించి ఆస్తిపన్నులు వసూలు చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆస్తిపన్నుల వసూళ్లపై నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడుతూ టాప్20లో ఉన్న బకాయిదారుల ఇళ్లవద్దకు వెళ్లాలన్నారు. ఈ ఐదురోజులు చాలా కీలకమని అన్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో కూడా ఆస్తిపన్ను చెల్లించవచ్చని ప్రజలకు తెలపాలన్నారు. 30మంది బిల్‌కలెక్టర్లు, 30మంది ప్రత్యేక అధికారులు మిగిలిఉన్న 5రోజుల్లో ఆస్తిపన్ను లక్ష్యాన్ని పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ప్రత్యేక అధికారులు,బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

బీబీసీ కెనాల్ వద్ద అంతరాష్ట్ర చెక్ పోస్టు ఏర్పాటు



రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

బోనకల్, మార్చి 26: బోనకల్‌లో ఓ సినిమా థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం అక్కడ నుంచి అధికారులు బీబీసీ కెనాల్ వద్దకు మార్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ ఆర్డీవో గణేష్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టు మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ లక్ష్మణ్, పాల్గొన్నారు.

కారేపల్లి: అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ తిరుపతిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద సీఐ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముదిగొండ: ముదిగొండ మండలం వల్లభీ చెక్‌పోస్టును అడిషనల్ డీసీపీ ప్రసాదరావు మంగళవారం తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల మూసివేత

• ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ.. ఆదేశాలు జారీ



లూర్దుమాత పరీక్షా కేంద్రంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆదేశాల మేరకు మూసివేసిన సీసీ కెమెరాలు

తల్లాడ, మార్చి 26: పదోతరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు తాత్కాలికంగా మూసివేశారు. తల్లాడ మండలం నారాయణపురంలోని లూర్దుమాత ఉన్నత పాఠశాలలోని పదోతరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రంలో ప్రతి తరగతి గదికి సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో ఒక గదిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మినహాయించి మిగిలిన గదుల్లోని సీసీ కెమెరాలను మూసివేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ కోసం ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పాఠశాల యాజమాన్యానికి అనుసంధానం చేయబడింది. పదోతరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రంగా లూర్దుమాత ఉన్నత పాఠశాల ఉంది. పరీక్షలు ప్రారంభమై తెలు గు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల పరీక్షల వరకు అన్ని సీసీ కెమెరాలను యధాతథంగా ఉంచారు. పరీక్షా కేంద్రాన్ని గణితం సబ్జెక్టు పరీక్ష నాడు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఉండటాన్ని పాఠశాల యాజమాన్యం పరిధిలో సీసీ కెమెరాల మానిటరింగ్ ఉండటం వల్ల ప్రశ్నాపత్రం లీకేజీ వంటి సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదముండవచ్చుననే భావించి ముందు జాగ్రత్తగా సీఎస్, డీవో ఉండే గది మినహా మిగిలిన గదుల్లోని సీసీ కెమెరాలను పరీక్షలు ముగిసేవరకు తాత్కాలికంగా మూసివేయాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి లిఖితపూర్వకంగా సీఎస్, డీవోలను ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఒక గది మినహా మిగిలిన గదుల్లోని సీసీ కెమెరాలకు తాత్కాలికంగా ప్లాస్టర్లు అంటించి మూసివేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల మాస్ కాపీయింగ్ కోసం సీసీ కెమెరాలను మూసివేశారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి ఊహాగానాల వల్ల పదోతరగతి విద్యార్థుల భవిష్యత్‌కు విఘాతం కలుగుతుందని, విద్యాశాఖ ఉన్నతాధికారులు సీసీ కెమెరాల మూసివేతపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై సీఎస్ సీహెచ్.సుదర్శన్‌ను వివరణ కోరగా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రం గదుల్లోని పరీక్ష నిర్వహణ అంశాలు బహిర్గతం కాకుండా ఉండేందుకు అన్ని తరగతి గదుల్లోని సీసీ కెమెరాలను తాత్కాలికంగా మూసివేయటం జరిగింది.

పరీక్షా కేంద్రాల వద్ద పొరపాట్లకు తావివ్వొద్దు: కలెక్టర్ గౌతమ్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26: పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పొరపాట్లకు తావివ్వద్దని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం పదో తరగతి పరీక్షల నిర్వహణను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిక్కాబజార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇందిరానగర్‌లలో ఏర్పా టు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం, తాగు నీరు, కనీస మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. మొబైల్ ఫోన్లు కేంద్రంలోకి అనుమతించవద్దని సూచించారు. తనిఖీ తర్వాతనే అనుమతించాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలో మెత్తం 16,576 మంది విద్యార్థులకు 16,532 మంది హజరుకాగా, 44 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుకాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు.



పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

● వీడియోకాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

● పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపడతాం: కలెక్టర్ గౌతమ్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, జిల్లా అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నూతన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్‌తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, తాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు.

వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోరు బావులను, మోటార్లను పునరుద్ధరించాలని, అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, తాగు నీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సామగ్రిని సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బోర్ వెల్ రిపేర్లు, ఫ్లషింగ్ చేపట్టినట్లు తెలిపారు. హ్యాండ్ పంప్ లు పూర్తి స్థాయిలో పనిచేయునట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా 302 బోర్లు మంజూరు చేశామన్నారు.

పాలేరు రిజర్వాయర్ నుండి ఖమ్మం పట్టణానికి నీటి సరఫరా ఉన్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీఓ సన్యాసయ్య, డిపిఓ హరికిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీలత, ఎఫ్‌సీఐ ఆర్‌ఎం రంగ ప్రసాద్ నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీని సందర్శించిన శిక్షణ బీట్ ఆఫీసర్లు



జేవీఆర్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌బీవోలు

సత్తుపల్లిరూరల్, మార్చి26: మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం దూలపల్లిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన 60మంది బీట్ ఆఫీసర్లుకు సత్తుపల్లిలో శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం మండలంలోని జేవీఆర్ ఓసీలో బీట్ శిక్షణా అభ్యర్థులు సందర్శించారు. పలు అంశాలపై వారికి అక్కడ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, అటవీ అధికారులు ఉన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

● ముగ్గురిపై కేసు నమోదు



నాగమణి మృతదేహం

అశ్వారావుపేట రూరల్, మార్చి 26: అత్తింటి వేధింపులకు ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివాహిత మృతికి కారణమైన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రాలచెరువు గ్రామానికి చెందిన కంపసాటి వెంకన్న బాబుకు ఆంధ్రాలోని అల్లూరి జిల్లా యటపాక మండలం కాపవరం గ్రామానికి చెందిన నాగమణి(25)తో కొంతకాలం క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఇటీవల ఆమెను కొంతకాలంగా అదనపు కట్నం తేవాలని అత్తింటి వారు తీవ్రంగా వేధిస్తున్నారు. దీనిపై పలుమార్లు పంచాయతీలు కూడా నిర్వహించారు. ఈనెల 23న మరోమారు ఆమె తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి భర్త, అత్తమామలు వేధిస్తున్నారని తెలపగా ఓపికగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి రమణ ఫిర్యాదు మేరకు వివాహిత మరణానికి కారణమైన భర్త వెంకన్నబాబు, అత్త, మామయ్య భూలక్ష్మి, నాగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రఘు మృతదేహం

ములుగు, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన సంఘటన ములుగు పోలీస్‌స్టేషన్ పరిధి జవహర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పొడెం రఘు(30) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి పది రోజుల క్రితం ములుగుకు పెయింటింగ్ పని నిమిత్తం వచ్చాడు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఖమ్మం క్రైం: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఖమ్మం నగరపరిధిలో జరిగింది. ఖమ్మం రూరల్ మండలం, తనగంపాడు గ్రామానికి చెందిన నర్రా సంజీవరావు(29) సుతారి పని చేస్తుంటాడు. మంగళవారం చింతగుర్తిలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బల్లెపల్లి వద్ద ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సంజీవరావును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

యువకుడికి గాయాలు....

బోనకల్: మండలంలోని రావినూతల బ్రిడ్జి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. వైరా మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన బంక చందు ద్వి చక్ర వాహనంపై బోనకల్ వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రం గా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జై ఆంజనేయం

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 26: ఆ దేవాలయానికి ధూపదీప నైవేద్యాల నిమిత్తం ఒక భక్తుడు భూమిని దానంగా ఇచ్చారు. అయితే అక్రమార్కుల కళ్లు అత్యంత విలువైన సదరు భూమిపై పడ్డాయి. తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ గ్రామానికి చెందిన వారు ఆ ప్రయత్నాలను తిప్పికొట్టారు. ఎన్నో ఏళ్ల పోరాడారు. చివరకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లటంతో ఆయన కలెక్టర్ వీపీ గౌతమ్‌ను సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటిన కదిలారు. సర్వే చేసి భూమి దేవుడిదేనని తేల్చారు. అనంతరం భూమిని దేవుడి పేరిట రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించారు.

నగరపరిధిలోని టేకులపల్లి ఆంజనేయస్వామి దేవాలయానికి 1966లో కన్నయ్యాలాల్‌సింగ్ అనే భక్తుడు 3.10 ఎకరాల భూమిని ఇచ్చారు. ధూప,దీప నైవేద్యాల నిమిత్తం ఈ భూమిని దానం చేశారు. సర్వేనెంబర్ 504లో ఉన్న ఈ భూమి నగరంలో శ్రీశ్రీ సర్కిల్ సమీపంలో ఉంది. ఈ ప్రాంతంలో ధరలు పెరిగి భూమి విలువ కోట్ల రూపాయలకు చేరుకుంది. దీంతో అక్రమార్కులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయటమే కాకుండా, వేరే వ్యక్తులకు అమ్మేందుకు ఉపక్రమించారు. దీనిని గమనించిన టేకులపల్లి వాసులు అడ్డుకున్నారు. చివరకు కోర్టులో కేసువేసి న్యాయపోరాటం చేశారు. కోర్టులో గెలిచినా అక్కమార్కులు తమ ప్రయత్నాలను ఆపలేదు. ఫోర్జరీ కాగితాలతో మళ్లీ ఆక్రమణకు తెరలేపారు.

ఈ క్రమంలో టేకులపల్లి గ్రామస్తులు ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి తుమ్మల వెంటనే కలెక్టర్ గౌతమ్‌తో మాట్లాడారు. దేవాలయ భూమిని కాపాడి ధరణి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి, రికార్డులు పరిశీలించారు. దేవుడి పేరిట భూమిని నమోదు చేశారు. భూమి పరిరక్షణకు కాంపౌండ్‌వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీర్ఘ కాల సమస్య పరిష్కారం కావటంతో టేకులపల్లి గ్రామస్థులు మూడురోజుల క్రితం కలెక్టర్‌కు సన్మానం చేశారు.

మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖమ్మం సంక్షేమ విభాగం: ఆంజనేయ స్వామి భూమిని కబ్జా కోరుల నుంచి కాపాడారని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి టేకులపల్లి గ్రామస్థులు క్షీరాభిషేకం చేశారు.



టేకులపల్లి ఆంజనేయస్వామి దేవాలయం భూమిని పరిశీలిస్తున్న స్థానికులు

కారేపల్లిలో సామాజిక తనిఖీ

కారేపల్లి, మార్చి26: మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులకు సంబంధించి మంగళవారం సామాజిక తనిఖీ ఎంపీవో పర్వీన్ కైసర్ అధ్యక్షతన ప్రారంభమైంది. మండలంలో 41గ్రామ పంచాయతీలకు గాను 14గ్రామ పంచాయతీలకు సంబంధించిన నివేదికలను సమర్పించారు. సామాజిక తనిఖీ బృందాలు ఆయా గ్రామాల్లో పరిశీలించిన ఉపాధి పనులలో అనేక అవకతవకలు బయటకు వస్తున్నాయి. పనుల పర్యవేక్షణలో రిజిస్టర్లు సక్రమంగా రాయకపోవడాన్ని తనిఖీ బృందాలు గుర్తించారు. అలాగే పలు గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి కొలతలు గుర్తించకపోవడం, కూలీల మస్టర్లను సరిగ్గా నిర్వంచలేదని అధికారుల దృష్టికి తనిఖీ బృందం సభ దృష్టికి తీసుకువచ్చింది. ప్రతేక్యంగా పనుల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడం, పనుల తీరును పర్యవేక్షణ లేకపోవడంతో అనేక విషయాలను తనిఖీ బృందాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. పల్లె ప్రకృతివనాలు ఎవెన్యూ ప్లాటేషన్ లలో నాటిన అనేక మొక్కలు చనిపోయిన వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటలేదని విషయాన్ని బృందాలు అధికారులకు నివేదికలలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

వైరా, మార్చి 26: మండలంలోని విప్పలమడక గ్రామంలో దేవబక్తిని అర్జున్‌రావు అనే రైతుకు చెందిన ట్రాక్టర్ ట్రక్కు సోమవారం అర్ధరాత్రి అపహరణకు గురైంది. విప్పలమడకలోని సోమలింగేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ట్రాక్టర్ ట్రక్కును ఈనెల 22న పార్కింగ్ చేశారు. కాగా మంగళవారం ఉదయం ట్రక్కు కోసం వెళ్లి చూడగా కన్పించలేదు. గ్రామంలో ట్రక్కు కోసం ఆరా తీయగా ఎవరూ తీసుకువెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ ట్రక్కు రూ.1.30లక్షల విలువ కలిగి ఉంటుందని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

అశ్వారావుపేట రూరల్, మార్చి 26: మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఓవ్యక్తి మరో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన అశ్వారావుపేటలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన చిన్నారావు, రంజాన్ స్నేహితులు. మంగళవారం కూలి డబ్బుల విషయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఇదే సమయంలో రంజాన్ గొడ్డలితో చిన్నారావుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తమ్మిలేరు బ్రిడ్జిపై అదుపుతప్పిన లారీ



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

సత్తుపల్లిరూరల్, మార్చి26: సత్తుపల్లి పట్టణ శివారులో ఓ లారీ అదుపుతప్పిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అశ్వారావుపేట నుంచి సత్తుపల్లికి వస్తున్న లారీ తాళ్లమడ గ్రామం దాటిన తర్వాత జాతీయ రహదారిపై తమ్మిలేరు బ్రిడ్జిపైన గుంతల కారణంగా రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పిం ది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలుకాలేదు.

భద్రాది సీఆర్‌వో కార్యాలయంపై వ్యక్తి మృతి

● కాలుజారి పడి మృతి చెందినట్లు నిర్ధారణ



జాఫర్ మృతదేహం

భద్రాచలం, మార్చి 26: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం సీఆర్‌వో (సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్)కార్యాలయంపై అంతస్తులోని బాత్‌రూం వద్ద ఖమ్మానికి చెందిన జాఫర్ అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే ఇతడి మృతిపై తొలుత అనుమానాలు వ్యక్తమయినా పోలీసుల విచారణలో అతడు ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందాడిని నిర్ధారించారు. దేవస్థానం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న వసతి భవనాల్లో టైల్స్ వేసే పనికి వచ్చిన జాఫర్ బాత్రూం వద్ద మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని మంగళవారం గమనించిన కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై భద్రాచలం ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మృతుడి తలపై మాత్రమే దెబ్బతగిలిన ఆనవాళ్లు ఉన్నాయని, అతడు బాత్‌రూం వద్ద కాలుజారి పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి బంధువులు కూడా అతడి మృతిపై ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు, మార్చి 26: బూర్గంపాడు మండల పరిధిలోని గోదావరి నుంచి సోమవారం రాత్రి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేట రూరల్, మార్చి 26: యువతి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని నారంవారిగూడెం కాలనీకి చెందిన 18 ఏళ్ల యువతి 25న రాత్రి భోజనం చేసి నిద్రపోయింది. రాత్రి 12గంటల ప్రాంతంలో తల్లి లేచి చూడగా యువతి కనిపించలేదు. యువతి అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అశ్వారావుపేట మండలంలో మైనర్ బాలిక...

అశ్వారావుపేట రూరల్, మార్చి 26: మైనర్ బాలిక అదృశ్యంపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. ఇంటి వద్ద బాలిక ఒక్కతే ఉంది. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. దీనిపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లలో
అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఆర్‌ఎం వెంకన్న » ఉమ్మడి జిల్లాలో నిబంధలను పాటించని దుకాణాలకు జరిమానాలు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 26: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిదిలోని ఏడు డిపోల పరిదిలోని బస్టాండ్‌లలోని దుకాణాలలో ప్రయాణికుల నుంచి ఎంఆర్‌పీ కంటే అధిక ధరలను వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవటంతో పాలు బారీ జరిమానాలు విదిస్తామని రీజనల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న హెచ్చరించారు. మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిదిలోని పలు బస్టాండ్‌లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని పలు దుకాణాలకు జరిమానాలు విదించారు. ఖమ్మం నూతన బస్టాండ్‌లో నిబంధనలు పాటించకుండ అదిక ధరలను అమ్ముతున్న 8 దుకాణాలకు రూ. 10వేల జరిమానా, సత్తుపల్లిలో ఇద్దరు దుకాణాయజమానులకు రూ.1500, ఇల్లెందులో రూ.500, భద్రాచలంలో ఆరు దకాణా యజమానులకు 6000ల జరిమానాలు విదించినట్లు ఆర్‌ఎం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైన అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు. ఖమ్మం నూతన


ఖమ్మం న్యూబస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

బస్టాండ్ 9959225979, సిటి బస్టాండ్ 9959225965, సత్తుపల్లి 9959225990, మణుగురు 8985361796, కొత్తగుడెం 9959225982, మధిర 7382925289, భద్రాచలం 9959225987, ఇల్లెందు 9959225984 నెంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు.

టార్పాలిన్ లేకుండానే బొగ్గు లారీలు..

» అదే దారిలో ఇసుక లారీలు..
» పొంచి ఉన్న ప్రమాదాలు..
» పట్టించుకోని సంబంధిత అధికారులు

మణుగూరుటౌన్, మార్చి 26: మణుగూరు ఏరియా నుంచి బీటీపీఎస్‌తోపాటు ఇతర ప్రాంతాలకు బొగ్గు లోడ్‌తో వెళ్లే లారీలు టార్పాలిన్ కట్టకుండానే వెళ్తొన్నాయి. దీంతో రహదారులపై ఎక్కడ పడితే అక్కడ బొగ్గు రహదారులపై పడడమే కాకుండా పలు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. లారీ బాడీ లేవల్‌కన్నా అధికంగా టిప్పర్‌లతో బాడీ లారీలు బొగ్గు లోడ్ చేసుకుని ప్రధాన రహదారుల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో రహదారిపై అక్కడక్కడ ఉన్న గోతుల్లో లారీలు ఒకేసారిగా దిగడంతో రహదారులపైన బొగ్గు లారీ నుంచి జారీ పడిపోతోంది. దీంతో ప్రదాన రహదారిపై రాకపోకలు సాగించే ద్వి చక్ర వాహనదారులు ఆ బొగ్గు రాళ్లను తప్పించబోయి లేదా బొగ్గు రాళ్లపైకి ఎక్కి జారీ పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ బొగ్గు రాళ్లను తొక్కుకుంటూ లోడ్‌తో వెళ్లే లారీల టైర్‌ల కిందపడిన బొగ్గు జారీ పక్కనే వెళ్తోన్న పాదచారులకు తాకిన గాయాలపాలు చేసిన సంఘటనలు అనేకమున్నాయి. ఇప్పటికైన సింగరేణి అధికారులు బొగ్గు కాంటా నుంచి బయటకు వెళ్లే లారీలకు పూర్తి స్థాయిలో టార్పాలిన్ లేకుండా పంపిచవద్దని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



అదే దారిలో ఇసుక లారీలు..

మణుగూరు సబ్ డివిజన్‌లోని గోదావరి నదీ తీరంలోని ఇసుక ర్యాంప్‌లనుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇసుక లారీలు టార్పాలిన్ లేకుండానే వెళ్లోన్నాయన్న విమర్శలున్నాయి. లారీల నిర్దేశిత లోడ్‌కన్నా అక్రమంగా అధికంగా ఇసుకను లోడ్ చేసుకుని నామ మాత్రంగా గ్రీన్ మ్యాట్‌లను పై పైన పరుచుకుని ఇష్టానుసారంగా రహదారులపై చక్కర్‌లు కొడుతున్నాయి. రాత్రి సమయాల్లో నామమాత్రంగా కప్పుతున్న గ్రీన్ మ్యాట్‌లు గాలికి లేస్తుండటంతో లారీ వెనకాల వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. పగులు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై పలుమార్లు రవాణా, పోలీసు శాఖలకు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న దాఖలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు టార్పాలిన్ లేని వాహనాలను రహదారులపైకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంజన్నకు అభిషేకం.. రామయ్యకు కల్యాణం

భద్రాచలం, మార్చి 26: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆన్‌లైన్‌లో 349 టికెట్ల అమ్మకం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న జరిగే శ్రీరామనవమికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 349 టికెట్లు అమ్మకం జరిగింది. భక్తుల సౌకర్యార్థం 11,495 టికెట్లు భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా అందులో 349 టికెట్లు అమ్మగా 11,146 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే పట్టాభిషేకానికి సంబంధించి 2,430 టికెట్లు అందుబాటులో ఉంచగా 44 టికెట్లు అమ్ముడయ్యాయి.

భద్రాద్రి, పర్ణశాలను సందర్శించిన
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి సతీమణి


పర్ణశాల కుటీరం వద్ద మాజీ ఉపరాష్ట్రపతి కుటుంబ సభ్యులు

దుమ్ముగూడెం మార్చి 26: భద్రాచలం రామయ్యను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి సతీమణి ఉషానాయుడు మంగళవారం దర్శించుకున్నా రు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పర్ణశాల రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపు కుటీరం, నారచీరల ప్రాంతాల్ని సందర్శించారు. అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది ఎగ్గడి శివ, రాములు వారిని సాదరంగా ఆహ్వానించారు.

రామయ్య కల్యాణానికి
ఇంజనీరింగ్ పనులకు టెండర్ల ఖరారు

భద్రాచలం, మార్చి 26: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు చేపట్టే ఇంజనీరింగు పనుల టెండర్లు అధికారికంగా ఖరారు అయ్యాయి. మొత్తం రూ.1,30,14,000 విలువైన 19 పనులకు టెండర్లను ఆహ్వానించగా రూ.1,00,59,732కు ఖరారు అయ్యాయి. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపం, పర్ణశాలలో రంగులు వేసేందుకు రూ.7,23,411, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసేందుకు రూ.3.56 లక్షలు, సెక్టార్ల వద్ద ఎనిమిది ప్రవేశ ద్వారాల ఏర్పాటుకు, ఆర్నమెంటల్ ఫైబర్ ఆర్చిగేట్లు ఏర్పాటు చేసేందుకు రూ.5.46 లక్షలు, ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలంలో స్వాగత ద్వారాల ఏర్పాటుకు రూ.4 లక్షలు, కల్యాణ మండపం, సెక్టార్లకు రంగులు వేసేందుకు రూ.4.51 లక్షలు, తాత్కాలిక క్యూలైన్ల ఏర్పాటుకు రూ.4.74 లక్షలు, భక్తులకు ఉచిత వసతి కేంద్రాల వద్ద షామియానాలు, ఇతర వసతుల కల్పనకు రూ.6.91 లక్షలు, 15 ప్రసాదాల కౌంటర్లు, 60 తలంబ్రాల కౌంటర్ల ఏర్పాటుకు రూ.6.08 లక్షలు, ఎల్‌ఈడీ స్ర్కీన్ల ఏర్పాటుకు రూ.5.71 లక్షలు వెచ్చించేందుకు టెండర్లు ఖరారు అయ్యాయి.

మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ సత్తా చాటాలి

● కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 26: మల్కాజ్‌గిరి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మేజార్టీ సాధించి, రాష్ట్రంలోనే సత్తాను చాటాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల బంధువులు నివాసం ఉండే మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిదిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ముఖ్య కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే షైనంపల్లి హన్మంతరావు, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను
ప్రజలు భగ్నం చేస్తారు..

● రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని, తెలంగాణా ప్రజలు బీజేపీ కుట్రలను భగ్నం చేస్తారని ఎంపీ (రాజ్యసభ) వద్దిరాజు రవిచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవితకు ఏమాత్రం సంబంధంలేని కేసులో ఈడీ విచారణ పేరుతో కేసులు పెట్టి జైలుకు పంపటాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తమకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, కవిత నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.మహానేత కేసీఆర్, ఉద్యమపార్టీ బీఆర్ఎస్ ఇటువంటి కుట్రలకు భయపడదని వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు.

బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో
ప్రవేశ పరీక్షకు దరఖాస్తులకు ఆహ్వానం

● ఏప్రిల్ 28న పరీక్ష

ఖమ్మం,ఖానాపురంహవేలి మార్చి 26: మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో బాలికల, బాలురులకు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. బాలికలకు ఖమ్మం జిల్లాలో బాలురులకు భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలో వేరేవేరుగా కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సొసైటీలలో చదివే విద్యార్థులు ఈ డిగ్రీ ప్రవేశ పరీక్షకు అర్హులని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న నిర్వహిస్తునట్లు తెలిపారు. విద్యార్థులు www.tsrdceet.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను చేసుకోవాలని తెలిపారు. హల్‌టికెట్లను ఏప్రిల్ 21 నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848161319, 8019422103 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

భూసేకరణ పనులు
వేగిరం చేయాలి

అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26: జిల్లాలో నీటిపారుదల శాఖకు సంబంధించి పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటిపా రుదల, రెవెన్యూ అధికారులతో భూసేకర ణ ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, నీటిపారుదల శాఖకు సంబంధించి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, మున్నేరు రిటెయినింగ్ వాల్ ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీతారామ లింక్ కెనాల్‌కు జూలూరుపాడు, ఏన్కూరు ఎన్నెస్పీ మెయిన్ కెనాల్ 22 కి.మీ. మేర నిర్మాణానికి 103 ఎకరాల అదనపు భూసేకరణ విషయమై ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలన్నారు. నాచారం, లింగన్నపేట, ఏన్కూరు గ్రామాల గుండా పోయే కెనాల్ కు భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. మున్నేరు రిటెయినింగ్ వాల్ నిర్మాణం కోసం ఖమ్మం అర్బన్ మండలంలో ఖమ్మం, బురహాన్‌పురం, దానవాయిగూడెం, మల్లెమడుగు, ఖమ్మం రూరల్ మండలంలో పోలేపల్లి, ఎదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల గ్రామాల్లో 190 ఎకరాల భూసేకరణ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలైన్‌మెంట్ విషయంలో తిరిగి నీటిపారుదల, రెవిన్యూ శాఖల అధికారులు జాయింట్ సర్వే చేపట్టి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్, శ్రీనివాసరెడ్డి, ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో గణేష్, నీటిపారుదల శాఖ ఎస్ఈ లు, ఈఈలు, డీఈ లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

» పరిశీలించిన ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక
» ఇరు జిల్లాలో 2421 పోలింగ్ కేంద్రాలు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో చేపట్టారు. జిల్లాలోని 1459 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పీవో, ఏపీవో, ఎంవో ల జాబితా సిద్ధం చేయాలన్నారు. వాస్తవ సిబ్బంది ఆవసరంతో పాటు, రిజర్వ్ సిబ్బంది జాబితాలో ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 5840 మంది సిబ్బంది అవసరం ఉండగా, 20 నుంచి 30 శాతం రిజర్వ్ సిబ్బందితో కూడిన జాబితా సిద్ధం చేయాలన్నారు. నిబంధనల మేరకు పే స్కెల్, కేటగిరిని బట్టి, పీవో, ఏపీవో, ఓపివో ల నియామకం చేయాలన్నారు. ఎంపికచేసిన సిబ్బందికి సమాచారం అం దించి, శిక్షణలో పాల్గొనేలా చర్యలు చేపట్టి, మొదటి విడత శిక్షణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, ఏఎస్వో కిషోర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమ్


కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక సమీక్ష

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పక్రియ పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక తెలిపారు. మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలిసి ఎన్ఐసీ వారు రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, తొమ్మిది ఆక్సిలరీ పోలింగ్‌స్టేషన్లు ప్రపోజల్ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపామన్నారు. మొదటి ర్యాండమైజేషన్ పక్రియలో భాగంగా 1401 ప్రిసైడింగ్ అధికారులు, 2827 ఓపీఓలను కేటాయిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనంగా సిబ్బంది కేటాయింపు పక్రియ చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ డి. వేణుగోపాల్, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ ధారా ప్రసాద్, రంగా ప్రసాద్, ఎన్ఐసీ డీఐవో సుశీల్ కుమార్, డీఎల్ఎంటీ పి. సాయి కృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న దిగుబడి ధమాల్

» సగానికి పడిపోయిన దిగుబడి
» ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లే
» ఎకరాకు రూ.25 వేలు నష్టపోతున్నరైతులు
» నిలకడగా మొక్కజొన్న ధరలు


కోతకు వచ్చిన మొక్కజొన్న

చింతకాని, మార్చి 26: యాసంగిలో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు పంట దిగుబడులు భారీగా తగ్గడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో సాగుకు సాగర్ నీరు లేక ఉన్న నీటి వనరుల ఆధారంతో మండల వ్యాప్తంగా సుమారు 3 వేల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న చేశారు. అక్టోబరు, నవంబరులో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు రావడంతో పంటను రైతులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 40 క్వింటాలకు పైగా దిగుబడులు రావాల్సిన మొక్కజొన్నలు సగానికి పైగా పడిపోయి 20 నుంచి 25 క్వింటాలు మాత్రమే వస్తుండటంతో రైతులు ఎకరాకు సుమారు రూ 25 వేలు నష్టపోతున్నారు.

పెరిగిన పెట్టుబడులు

మొక్కజొన్న పంట సాగు రైతులకు భారంగా మారింది. ప్రత్యామ్నాయంగా మరో పంట లేకపోవడంతో రైతులు మొక్కజొన్న పంట సాగు చేయాల్సిన పరిస్థితి తప్పడంలేదు. విత్తనాల ధరలు, దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ కిరాయి మొదలుకొని ఎరువుల వినియోగం, పిచికారి మందులు, పంట కోతల కూళ్లు కలుపుకొని ఎకరాకు సుమారు రూ.25 వేల వరకు పెట్టుబడి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఈ యాసంగిలో చీడపీడలు ఉధృతి ఎక్కువకావడంతో రైతుకు మొక్కజొన్న పంట ఖర్చు రెండింతలవుతుంది. సాగు మధ్యలో అకాల వర్షాలు వస్తే మాత్రం రైతుకు మిగిలేది శూన్యమే.


మొక్కజొన్నలు కాంటా వేస్తున్న హమాలీలు

నిలకడగా మొక్కజొన్న ధరలు

మొక్కజొన్న ధరలు నెలరోజుల నుంచి నిలకడగ కొనసాగుతున్నాయి. ప్రభుత్వ మద్దతు ధర రూ.2090 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.2100 నుంచి 2130 వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు మొక్కజొన్న దిగుబడులు 20 నుంచి 25 క్వింటాలు మాత్రమే వచ్చి రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంటకు డబ్బులు రావడంతో పెట్టుబడులు ఖర్చులు పోగా రైతుకు మిగులుబాటు లేకుండా పోయింది. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. కౌలు రైతులకు నష్టాలు రావడమే కాకుండా చేతి నుంచి కట్టాల్సిన పరిస్థితి.

ఎకరాకు 20 క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చింది

పిల్లి లాల్ సాహేబ్, కౌలు రైతు చింతకాని



4 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. ఉన్న కొద్దిపాటి నీటితో పంటను పండించగా కేవలం 80 క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు పెట్టిన పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. కౌలు చేతి నుంచి కట్టాల్సిన పరిస్థితి. ఈ సారి మొత్తం నష్టమే.

వాతావరణ మార్పులు కారణంగా తగ్గిన దిగుబడులు

పల్లెల నాగయ్య వ్యవసాయ అధికారి, చింతకాని



నవంబరు, డిసెంబరులో వాతావరణంలో ఏర్పడిన మార్పులు కారణంగా మొక్కజొన్న పంట ఒత్తిడికి గురై దిగుబడులులో చాలా వ్యత్యా సం వచ్చింది. డిసెంబరు నెలలో వచ్చిన అకాల వర్షాలు పంట దిగుబడులకు ఒక కారణం. రైతులు పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఉంది.

కొనసా..గుతున్న మిషన్ భగీరథ పనులు

» ఏడేళ్లుగా పూర్తికాని పనులు
» మధిరలో 2018లో పనులు ప్రారంభించిన అప్పటి మునిసిపల్ మంత్రి కేటీఆర్
» పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మధిరటౌన్, మార్చి 26: మధిర మునిసిపాలిటీలో మిషన్‌భగీరథ పను లు ప్రారంభించి ఏడేళ్ల అయినా నేటికీ పనులు పూర్తికాక పోవడంతో ఇవి నత్తకు నడక నేర్పేలా సాగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. మధిరకు అంతకు ముందే తాగునీటి కోసం బోడేపూడి సుజల స్రవంతి, జాలిముడి తాగునీటి పథకం ఉన్నా.. గత ప్రభుత్వం భగీరథ తాగునీటి పథకాన్ని ప్రవేశపెట్టింది. మధిరలో అప్పటికే పనులు ప్రారంభం కాగా అధికారికంగా 2018 ఎన్నికలకు ముందు ఆనాటి మునిసిపల్ శాఖ మంత్రి మధిరలో ఈ పథకానికి శంకుస్థాపన చేసి సంవత్సరంలో ఈ పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ భగీరథ ట్యాపుల ద్వారా మధిర పట్టణంలో ఒక్క ఇంటికి కూడా నీళ్ల ఇచ్చిన దాఖలాలు లేవు. మధిర పట్టణంలో 7వేలకు పైగా పంప్ కనెక్షన్‌లు ఉన్నప్పటికీ కేవలం 3వేల కనెక్షన్లకు బిగించారు. అయితే అవికూడ కొన్నింటిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంకా కొన్ని వార్డుల్లో పైప్‌లైన్‌లు వేయటం కూడా పూర్తి కాలేదు. వేసిన పైప్‌లైన్ల కోసం సిమెం ట్ రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వి వదిలేశారు. గతంలో 13 లక్షల లీటర్ల కెపాసిటీ కల ఐదు వాటర్ ట్యాంక్‌లు ఉండగా మరో 25 లక్షల లీటర్ల కెపాసిటీ గల ఐదు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం పనులు మొదలు పెట్టగా కేవలం ఒక్క ట్యాంక్ నిర్మాణం మాత్రమే పూర్తి అయింది. వేసవి ప్రారం బం కావడం ఎండలు మండుటుండటంతో ఈ సారి అంతంత మాత్రమే వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పడి పోయే ప్రమాదం ఉందని త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇంటింటికి నల్లా ద్వారా నీళ్ల ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తి కాని వాటర్‌ట్యాంక్


2019 నుంచి ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద నిర్మాణం జరుగుతున్న వాటర్‌ట్యాంక్

నెలరోజుల్లో పనులు పూర్తి అయ్యేలా చూస్తాం

నరేష్‌రెడ్డి, మునిసిపల్ ఏఈ

కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలేయడంతో పనులు ఆలస్యమయ్యాయి. మరో కాంట్రాక్టర్‌కు పను లు అప్పగించాం. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అత ను కూడా పనులు నిదానంగా చేస్తున్నాడు. నెలరోజుల్లో పను పూర్తి చేసేలా చూస్తాం. మిషన్‌భగీరథ నీళ్లను ఇప్పటి కే పాత ట్యాంక్‌లకు ఎక్కించి తాగునీరు ఇస్తున్నాం. పాత పంప్‌హౌజ్‌ల ద్వారా లభించే నీళ్ల మధిర పట్టణానికి నాలుగు నెలల దాకా సరిపోతాయి. వేసవిలో ఎటువంటి నీటి ఎద్దడి ఉండదు.

కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో క్రీడాకారుల కోలాహలం

●గిరిజన క్రీడాకారుల ఎంపికలు ప్రారంభం

పాల్వంచ రూరల్, మార్చి 25: ఐటీడీఏ భద్రాచలం గిరిజన శాఖ పరిధిలోని గిరిజనశాఖ క్రీడా పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక పక్రియ కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. మంగళవారం క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు ప్రారంభించి అనంతరం మాట్లాడారు. గిరిజన సంక్షే మశాఖ అందిస్తున్న సదుపాయాలను, సౌకర్యాలను వినియోగించు కుని జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపికలకు మొదటిరోజు బాల, బాలికలు 110మంది హజరైనట్లు తెలిపారు. ఎంపికలకు పర్యవేక్షకు లుగా ఏఎస్‌వో కొమరం వెంకట నారాయణ, ఎస్‌వోఎస్ నాగేశ్వరరావు, బాలుర ఇన్‌చార్జ్ బుగ్గ వెంకటేశ్వర్లు, పీడీ బాలికల ఇన్‌చార్జ్ అన్నం వెంకటేశ్వర్లు, బ్యాటరీ టెస్ట్ ఇన్‌చార్జ్‌లు కే. వెంకటేశ్వర్లు, పీడీ పి. రాంబాబు, కే. నర్సయ్య, పీడీఎస్ రామారా వు, పీడీ కే. వెంకటేశ్వర్లు, పీఈటీ బి. మోతాలాల్, పీడీ కే. కృష్ణ, శిరోమణి, హత్తీరాం, రవి, ముత్తయ్య, రాంబాబు, నాగరాజు, వాసు పాల్గొన్నారు.


ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏకలవ్య విద్యార్థి

టేకులపల్లి, మార్చి 26: భద్రాద్రి జిల్లా టేకులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్‌లో 8వ తరగతి చదువుతున్న సీహెచ్ యోగేంద్ర ప్రణీత్ సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 24న ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆలేరులో జరిగిన సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలలో యోగేంద్ర భద్రాద్రి జిల్లా టీం తరుపున పాల్గొన్నాడు. అక్కడ ప్రతిభ కనపరచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 28న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి సబ్‌జూనియర్ సాఫ్టబాల్ పోటీలకు రాష్ట్రం తరుపున యోగేంద్ర ప్రణీత్ పాల్గొననున్నాడని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపాల్ భద్రయ్య తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, కోచ్ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ వేతనాలివ్వాలని వినతి



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి26: జాతీయ ఉపాధి హామీ పథకంలో కీలకంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వారికి ప్రతీ నెల వేతనాలు ఇవ్వాలని డీఆర్డీవో సన్యాసయ్యకు వినతిపత్రం అందించారు.మంగళవారం జిల్లావ్యాప్తంగా ఉన్న క్షేత్రసహాయకులు, సాంకేతిక నిపుణులు ఖమ్మం డీఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవటంతో తీవ్రఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంఘం నాయకులు పగిడిపల్లి మనోహర్, ఆవుల సంతోష్, నజీర్, మద్దాలి శ్రీనివాస్, రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన డీఆర్డీవో సన్యాసయ్య ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను వివరిస్తామన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని



బచ్చోడులో సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, మార్చి 26: తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గౌరవమిచ్చినప్పుడే జన్మసార్థక మవుతుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బచ్చోడులో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి గండమల్ల ఉపేందర్ రచించిన అమ్మే దేవత, నాన్నే దేవుడు అనే సీడీని వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో అంతరించిపోతున్న నైతిక విలువలను పెంపొందించడం కోసం వృద్ధులపై రచించిన సీడీ చాలా మంచిగా ఉందన్నారు.సమాజం పట్ల, ప్రపంచీకరణ పట్ల మనిషి ఎలా మాయమైపోతున్నాడు, ప్రపంచీకరణ ప్రభావం సమాజం మీద ఎలా పడుతుందో అనుభవిస్తున్నామని తెలిపారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కూడా ప్రతి ఒక్కరు కూడా జీవితాంతం వారిని గుర్తుంచుకోవాలని నేడు అనేక మంది తల్లిదండ్రుల పట్ల వివక్ష చూపుతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, అంగిరేకుల నరసయ్య, బింగిరమేష్, వశపొంగు వీరన్న, తోట ఉపేందర్‌రెడ్డి, ధర్మాచారి, తిమ్మిడి హనుమంతరావు, నేర్సుల వెంకటేష్, పాల్గొన్నారు.

విపక్షం చూపు.. పాలకపక్షం వైపు

- పార్టీలో చేర్చుకోవద్దంటూ కాంగ్రెస్ కేడర్ విన్నపం
- కొత్త నాయకులొస్తే వర్గాలు ఏర్పడతాయనే అభిప్రాయం
- స్థానిక కేడర్‌ను సంప్రదించాలంటూ నియోజకవర్గ నేతల ఆదేశాలు



సత్తుపల్లి, మార్చి 26: ఇతర పార్టీల నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి కొందరు నాయకులు వలస వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటూ ఉండటంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు గట్టిగానే వ్యతిరేకిస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఈ పరిస్థితి గత కొద్ది రోజులుగా స్పష్టంగా కనిపిస్తోంది. గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం, పదేళ్ల తరువాత అధికారం హస్తగతం కావాటంతో పాత కాంగ్రెస్ నాయకులతో పాటు కేడర్ మంచి జోష్ మీద ఉంది. సత్తుపల్లి నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విదితమే. పదేళ్ళుగా అధికారంలో లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎదురొడ్డి కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉన్నామని ప్రస్తుతం అధికారం వచ్చిన తరువాత వలస నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ కేడర్ అంటున్నారు. వారు వస్తే ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకొని పని చేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని, వలస నాయకులదే పెత్తనం అవుతుందని కాంగ్రెస్‌లో గ్రామ, మండల స్థాయి నాయకులు చెపుతున్నారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి

2014లో అప్పటి టీఆర్ఎస్ అధికారంలోకి రావటంతో తుమ్మల నాగేశ్వరరావుతో తెలుగుదేశం నాయకులు ఎక్కువ శాతం ఆ పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సహా ఆయన అనుచరులు 2016లో టీఆర్ఎస్‌లో చేరారు. మారిన రాజకీయ పరిణామా నేపథ్యంలో తుమ్మల, పొంగులేటి గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. కొందరు మండల స్థాయి నాయకులు బీఆర్ఎస్‌లో ఉండిపోయారు. ఎన్నికల్లో సత్తుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో ప్రస్తుతం నియోజకర్గంలో కొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరిగింది. ఇతర పార్టీల నాయకులను ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చే వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మండలాల్లో ఇలా....

కల్లూరు మండలానికి చెందిన మండల స్థాయి బీఆర్ఎస్ నాయకుడొకరు కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి తన అనుచరులతో చర్చించారు. విషయం బయటకు పొక్కటంతో కాంగ్రెస్ నాయకులు ఆయన చేరికను తీవ్రంగా వ్యతిరేకిస్తూ మండలంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసారు. ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటే గ్రామ స్థాయి నుంచి వర్గాలు ఏర్పడతాయని స్పష్టం చేసారు. గత ఎన్నికల్లో డాక్టర్ రాగమయి ఓటమికి కృషి చేసిన వారిని ఎలా చేర్చుకుంటారని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయం సీరియస్‌గా తీసుకొని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని కోరుతున్నారు. పెనుబల్లి మండలం మర్లకుంట, కుప్పెనకుంట్ల, ఉప్పలచెలక గ్రామాలకు చెందిన నాయకులు కూడా కొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ఆ మండలంలో ప్రచారం జరిగింది. దీంతో ఆ మడలంలో కాంగ్రెస్ కేడర్ అప్రమత్తమయి తమను సంప్రదించకుండా ఎవరినీ పార్టీలో చేర్చుకోవద్దని ఆయా గ్రామాల నాయకులు నియోజకవర్గ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు.

డైలమాలో విపక్ష నేతలు

తల్లాడ, వేంసూరు మండలాల్లో కొందరు నాయకులు కూడా ఈ రకంగా పార్టీ మారేందుకు సిద్ధమైనా కల్లూరులో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించి బహిరంగంగా వ్యతిరేకించటంతో వారు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలిసింది. పార్టీ మారాలని, అధికార పార్టీలో చేరాలని భావిస్తున్న వారు స్థానిక నాయకత్వాన్ని కాదని ఎవరిని సంప్రదిస్తున్నారనే విషయంపై పార్టీ కేడర్ ఆరా తీస్తోంది. ఎవరి సమక్షంలో పార్టీలో చేరాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంగా వలస నాయకుల విషయంలో స్థానిక కాంగ్రెస్ కేడర్ అప్రమత్తంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

చింతకాని,మార్చి26: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి యేసు, తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బస్వాపురంలో ఉపాధి పనులను వారు పరిశీలించారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బుర్ర అంజయ్య, ఆవుల అశోక్, లక్ష్మయ్య, ఆవుల వీరయ్య పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా ఐక్యతను చాటేవే క్రీడలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 26: కుల మతాలకు అతీతంగా యువతలో క్రీడలు ఐక్యతను చాటుతాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దిన్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఖమ్మంలో ఖమ్మం ఎన్ఎస్‌పీ క్యాంపులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రీడాకారులకు బహుమతులను అందించారు.

పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ నుంచి మినహాయింపు ఇవ్వండి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 26: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు, మూడు సంవత్సరాలలోపు పదవీ విరమణ చేయువారికి మినహాయింపు కల్పించాలని పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో సోమశేఖరశర్మను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మోతుకూరి మధు, యలమద్ది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- జిల్లాలో వివిధ ఆలయల్లో వేడుకలు
- కోటమైసమ్మ హుండీ ఆదాయం రూ.34,655

నేలకొండపల్లి,మార్చి26: నేలకొండపల్లిలోని అత్యంత పురాతనమైన శ్రీరాజగోపాలస్వామి(శ్రీసంతాన వేణు గోపాలస్వామి)ఆలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామివారి తిరుకల్యాణం నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ, రాజగోపాలస్వామిని వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. యాజ్ఞీకులు ఆరుట్ల రాజేష్ ఆచార్యులు, ఆలయ అర్చకులు ముడుంబై రామానుజాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. కార్యనిరహణాధికారి శ్రీకాంత్‌తో పాటుగా కల్యాణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని గార్లపాడు, బోనకల్ గ్రామాల్లో సోమవారం రాత్రి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణం జరిపించగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. బోనకల్‌లో కళ్యాణ మహోత్సవానికి జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తల్లాడ: తల్లాడలోని వేంచేసియున్న రుక్మిణి సమేత సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు తల్లాడ పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కోటమైసమ్మ హుండీ ఆదాయం రూ.34655

కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాలలో శ్రీకోటమైసమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ పరిశీలకురాలు ఆర్ సమత పర్యేక్షణలో జరిగింది. హుండీ ఆదాయం రూ.34655 వచ్చింది. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, అర్చకులు పుల్లయ్య శర్మ, ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గింజల నర్సింహరెడ్డి, తోటకూరి శ్రీనివాసరావు, బావ్‌సింగ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

వేంసూరు: వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8గంటలకు పవళింపు సేవతో ఉత్సవాలు ముగిశాయి. ఆరురోజులుగా కల్యాణ మహోత్సవాలను ఈవో నర్సింహారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు చెడుగుడు పోటీలను నిర్వహించారు.

రేపు శ్రీలక్ష్మితిరుపతమ్మ అమ్మవారి కల్యాణం

కామేపల్లి,మార్చి 26: మండల పరిధిలోని తాళ్లగూడెంలో గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ కళ్యాణ వేడుకలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుచ్చకాయల చిన్నవెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. మహోత్సవంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ రామాయణ సప్తాహం ప్రారంభం



సత్తుపల్లిరూరల్: వారంరోజుల పాటు స్థానిక కాకర్లపల్లి రోడ్డులోని శ్రీబాల లీలా కృష్ణ నివాసం నిర్వహించనున్న శ్రీరామాయణ సప్తాహం కార్యక్రమంలో మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైంది. ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ రామకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో శ్రీ రామాయణ సప్తాహంలో భాగంగా పట్టణంలో శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు సాగింది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి పండితులు హాజరయ్యే ఈ సప్తాహంలో భాగంగా ఈనెల 30న త్రిదండి అష్టాక్షరి జీయర్‌స్వామి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బాల లీలా కృష్ణ, మందపాటి కేశవరెడ్డి, నాగారపు సుబ్బారావు, కొకనకళ్ల శంకర్రావు, తాటికొండ వెంకటేశ్వరరావు, రాఘవయ్య పాల్గొన్నారు.





రాజగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, తల్లాడలో వేణుగోపాలస్వామి కల్యాణం, బోనకల్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల

రేపే బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మంలీగల్, మార్చి26: బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ మేరకు మంగళవారం బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే బార్ అసోసియేషన్ ఎన్నికలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు మాత్రమే జరుగుతాయన్నారు. ప్రతీ ఓటరు రాష్ట్ర బార్‌కౌన్సిల్ జారీచేసిన ఐడీకార్డుగానీ, బార్ అసోసియేషన్ జారీ చేసిన ఐడీకార్డు తీసుకురావాలని, పోలింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్లు తీసుకురావటం పూర్తిగా నిషేదమన్నారు. తెలంగాణ రాష్ట్రబార్‌కౌన్సిల్ వారి ఆదేశాల ప్రకారం బార్ కౌన్సిల్‌వారి దగ్గరవున్న సమాచారం ప్రకారం ఓటరు లిస్టులో పేరు నమోదు కాబడి, బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్న వారికి మాత్రమే ఓటు వేయటానికి అర్హులన్నారు. బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకొని ఏఐబీఈ క్వాలిఫై, పాస్ అయి, బార్‌కౌన్సిల్లో సభ్యత్వం లేకుండా ఉన్నవారు డిక్లరేషన్ ఇచ్చి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. డిక్లరేషన్ ఫారంను ఎన్నికల అధికారులకు ఇవ్వాలని, సభ్యులందరూ ఈ సూచనలు పరిగణలోకి తీసుకుని ఎన్నికలను సజావుగా జరిగేందుకు సహకరించాలని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు విన్నవించారు.

లోక్యాతండాలో ముగిసిన హోలీ వేడుకలు

కూసుమంచి, మార్చి 26: లోక్యాతండాలో సంప్రదాయ హోలీ వేడుకలు ఘనంగా ముగిశాయి. మూడోరోజు మంగళవారం తండావాసులు రంగేళి ఘనంగా జరుసుకున్నారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరు రంగులు చల్లుకున్నారు. మహిళలు సైతం ఉత్సాహంగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. న తండాకు చెందిన యువకులు కేరింతలు కొట్టుకుంటు రంగుల్లో మునిగితేలారు. మొదటి రోజు కోలాటం, రెండో రోజు డూండ్ వేడుకలు, మూడోరోజున రంగేళితో తండాలో వేడుకలు ముగిశాయి. సంప్రదాయాలు కొనసాగిస్తూ ఆచారాలు పాటిస్తు వేడులకును ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జర్పుల బాలాజీ నాయక్, గేరియా వడిత్య సామ నాయక్, సేటరామ్‌నాయక్, మాజీ సర్పంచి జర్పుల సుశీల గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి అన్నం ఫౌండేషన్ ఆసరా

నేలకొండపల్లి, మార్చి26: జాతీయ రహదారి బైపాస్ వంతెన కింద మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న వ్యక్తిని స్థానికుల సమాచారం మేరకు మంగళవారం అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. అన్నం శ్రీనివాసరావు తీసుకెళ్లాడు. మతి స్థిమితం లేని వ్యక్తి తనకు సంబంధించిన ఏ వివరాలు చెప్పలేక పోతున్నారని, ఆవ్యక్తిని హాస్పిటల్‌లో చేర్పించి బాగు చేయిస్తామన్నారు. ఆరోగ్యం కుదుటపడ్డాక వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఎక్కడన్నా ఇటువంటి వ్యక్తులుంటే అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందిస్తే తీసుకెళతామన్నారు. ఏఎస్ఐ కోడెత్రాసు, కానిస్టేబుల్ చరణ్‌సింగ్, సీపీఎం నాయకుడు ఏటుకూరి రామారావు ఉన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, మార్చి26: ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై వేర్వేరుగా కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ మంగళవారం రాత్రి తెలిపారు. సోమవారం రాత్రి వేంసూర్ రోడ్‌లో మునిసిపాలిటీలోని 8వవార్డు కౌన్సిలర్ ఎస్‌కే.చాంద్‌పాషాపై సాయి, దినేష్, వెంకటేశ్వరరావు, దిలీప్, నాగు దాడి చేశారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోగా కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ధర్మభిక్షానికి నివాళి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి26: మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయటమే ధర్మభిక్షానికి ఇచ్చే నివాళి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ధర్మబిక్షం 13వ వర్ధంతి సభలో బాగం మాట్లాడారు. తెలంగాణలో వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక ఉద్యమాలు చేశారని కీర్తించారు. ఆంధ్రమహాసభ నిర్మాణంతో పాటుగా తెలంగాణ సాయుధ పోరాటంలోను ముందుండి పోరాడి అందరికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. సూర్యాపేట కేంద్రంగా దళిత, బలహీన వర్గాల పిల్లల చదువు కోసం ఉచిత పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల వారీగా ప్రజల మధ్య విభజన తీసుకొస్తోందని అందుకే మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. దూసరి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన సభలో సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే జానిమయా, యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా న్యాయవాదుల సహకారసంఘం సమావేశం

ఖమ్మంలీగల్, మార్చి26: మంగళవారం జిల్లా న్యాయవాదుల సహకార సంఘం 6వ వార్షిక సమావేశం బార్ అసోసియేషన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు హాజరయ్యారు. ఈ న్యాయవాదుల సొసైటీ రోజురోజుకి అభివృద్ధి చెందుతుందన్నారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి తెల్లాకుల రమేష్‌బాబు సొసైటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. న్యాయవాదుల సొసైటీ ఇంకా ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సహకారసంఘం అధ్యక్షుడు కాసర రాజశేఖర్‌రెడ్డి, కార్యవర్గం చుంచుల మల్లిఖార్జున్‌రావు, జి.జి.రామారావు, జె.హేమంత్‌కుమార్, సొసైటీ డైరెక్టర్స్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

సత్తుపల్లిరూరల్, మార్చి26: నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ అన్నారు. మంగళవారం రాత్రి సత్తుపల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ లేని వాహనాలు, రాంగ్ పార్కింగ్, రాంగ్‌రూట్, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. నంబర్ ప్లేట్ సరిగాలేని వాహనాలకు జరిమానాలు విధించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసినా, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడినా చర్యలు తప్పవన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

- పలు గ్రామాలకు నిలిచిపోయిన తాగునీటి సరఫరా



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

వైరా,మార్చి 26: వైరాలో ఓ రోడ్డు కాంట్రాక్టర్‌కు చెందిన ఎక్స్‌కవేటర్ నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. వైరాలోని మధిర రోడ్డులో రెండు గురుకుల పాఠశాలల మధ్యలో నరికివేసిన చెట్టు మొదలును తీసేందుకు కాంట్రాక్టర్‌కు చెందిన ఎక్స్‌కవేటర్ తవ్వకాలు జరపడంతో మిషన్ భగీరథ(బోడేపూడి సుజల స్రవంతి) ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. వైరాలో రెండు లైన్లతో ఉన్న మధిర రోడ్డును రూ.12కోట్లతో నాలుగులైన్ల రోడ్డుగా నిర్మించేందుకుగానూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను రెండునెలల నుంచి నరికి వేస్తున్నారు. ఈ రోడ్డు వెడల్పు చేసేందుకుగానూ నరికిన చెట్టు మొదళ్లను ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుండగా ఆ అంచుకే ఉన్న 300 డయా పైపులైన్ పగిలిపోయింది. దీనివలన వైరాలోని కొన్ని ప్రాంతాలకు, మండలంలోని సోమవరం, తాటిపూడి, కొష్టాల, జింకలగూడెం, రెబ్బవరం, గొల్లపూడి, గొల్లెనపాడు, అష్ణగుర్తి, వల్లాపురం, పాలడుగు, గోవిందాపురం, గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ గ్రామాలతోపాటు బోనకల్ మండలంలోని సీతానగరానికి తాగునీటి సరఫరా నిల్చిపోయింది.

సృజనాత్మకతతోనే మానవ మనుగడ

- ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ
- ఐడియాథన్ వర్క్‌షాప్ ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి26: సృజనాత్మకతతోనే మానవ మనుగడ సాధ్యమని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. మంగళవారం కళాశాలలో ఐడియాథన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజంలో మానవజాతి అభివృద్ధి చెందాలంటే సృజనాత్మకత అవసరమన్నారు. ఆర్‌డిఐవో సహకారంతో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ఐదురోజుల పాటు జరుగుతుందన్నారు. ఈవర్క్‌షాప్ ముగిసే సమయానికి విద్యార్థులలో ఉన్న ఆలోచనలను ఆచరణలో పెట్టి చివరిరోజు ఎక్స్‌పో నిర్వహిస్తామని తెలిపారు. విద్యా ర్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, ఆర్డీఐవో సీఈవో కార్తిక్, ఎన్. శ్రీకాంత్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణ